


# సర్పశిల

## - భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

*ఇప్పటివరకూ జరిగిన కథ*

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్పశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కాపాడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

**దుర్గతి నాశిని దుర్గే జయజయ**

**కాళ వినాశిని కాళీ జయజయ**

**ఉమా రమా బ్రహ్మాణీ జయజయ**

**రాధా సీతా రుక్మిణి జయజయ**

చక్కగా పాడుతున్నారు 16మంది కన్యలు. వారు మహా కన్యాదేవితో వచ్చినవారు. మాయామయీ, హనుమంతూ కూడా వారితో శృతి కలిపారు. శుక్రవారం. దీపాల వెలుగుతో క్షిప్రా(సిప్రా) నదీ తీరం వెలిగిపోతోంది.

"అమ్మా.. యీ శ్లోకాన్ని జపిస్తే ఏం లాభం?" అడిగాడు హనుమంతు.

"దుర్గమ్మ వారు నిన్ను దుర్గతినించి రక్షిస్తారు. సద్గతి కలుగుతుంది. కాళీ అమ్మవారు నీ పాపాల్ని నాశనం చేస్తారు. ఉమ, రమ, బ్రహ్మాణీ, రాధా, సీతా, రుక్మిణి నీకు సకల శుభాలని అనుగ్రహిస్తారు నాయనా, మంత్రాల్లాగానే శ్లోకాలు కూడా యోగనిర్మితాలు. ఏ అక్షరం పక్కన ఏ అక్షరం పెడితే 'శక్తి' ఉద్భవిస్తుందో యోగి పుంగవులకి తెలుసు" అన్నది మాయామయి.

"శబ్దం వల్ల ఏమిలాభం?" అడిగాడు హనుమంతు.

"సముద్రపు లోతుల్ని కనుక్కునేది శబ్దం వల్లనే, సరే, ఉరుము ఉరిమితే" అడిగింది మాయామయి.

"వర్షం వస్తుందనుకుంటాము."

"అర్ధరాత్రి కుక్క అరిస్తే?"

"దొంగలు వచ్చారనుకుంటాము"

"ఎవరైనా మూలుగుతుంటే?"

"నెప్పి వొచ్చిందనుకుంటాము. అది పొట్టలో కావొచ్చు, గుండెలో కావొచ్చు.. తలది కావొచ్చు" అన్నాడు హనుమంతు.

"శబ్దానికి మూలం వాయువు. వాయువు లేనిది శబ్దమేకాదు, సృష్టేలేదు. వాయువు లేకపోతే శ్వాస ఎక్కడినించి వస్తుందీ? శ్వాస తీసుకోకపోతే ఏ జీవి యీ సృష్టిలో బ్రతుకుతుందీ? నాయనా, శబ్దం లేనిచోటు యీ సృష్టిలో లేదు. ఇదిగో యీ తలుపుని తట్టు. వినిపించేది శబ్దం. ఆ బిందెలో నీటిని వేళ్ళతో కదిలించు. పుట్టేది శబ్దం. శబ్దంలేనిదెక్కడా? ఆ రహస్యం తెలుసు గనకనే మన మహా పురుషులూ, యోగులూ మంత్రాలని, శ్లోకాలను నిర్మించి, ఆ నిధిని మనకి ఇచ్చారు" చెప్పింది మాయామయి.

హనుమంతు ఆలోచిస్తున్నాడు.

"ఈ శంఖం నించి వచ్చే శబ్దానికి కూడా ప్రయోజనం వుందా?" అడిగాడు.

"ప్రయోజనాలు రెండు రకాలు. ఒకటి ప్రత్యక్ష ప్రయోజనం. రెండోది పరోక్ష ప్రయోజనం. అవి చాలా సూక్ష్మ విషయాలు నాయనా, పోనీ ఓ చిన్న సంగతి చెప్పనా... అడవిలో వుండే ఏనుగుల మంద వూళ్ళల్లోకి వస్తోందని తెలిస్తే ఏం చేస్తారూ?" అడిగింది మాయామయి నవ్వి.

"ఆ వాయిద్యాలని ఏమీ చెయ్యదుగానీ, వాయించిన వాళ్ళని చక్కగా భోంచేస్తుంది" పకపకా నవ్వి అన్నాడు హనుమంతు.

"అర్ధమయిందా. శబ్దాలు అన్నీ ఒకటికాదు.ఏ శబ్దానికి ఉన్న ప్రయోజనం దానికి వుంది. అలాగే మంత్రాలకీ, శ్లోకాలకీ కూడా దేనికి వుండే ప్రయోజనం దానికి వుంది." హనుమంతు తల నిమిరి అన్నది మాయామయి.

"ఈ మంత్రాలు శ్లోకాలు ఎప్పుడు పఠించాలమ్మా" అడిగాడు హనుమంతు.

"ఆవి వున్నవి కేవలం పఠించడానికి కాదు. ఎప్పుడు, ఎలా అనే విషయాలు గురువే చెబుతారు" అన్నది మాయమయి.

"నాకూ కొన్ని నేర్పవచ్చుగా?" అన్నాడు హనుమంతు.

"దుర్గతి నాశిని దుర్గ జయ జయ ఒక్కటి చాలు" నవ్వి అన్నది మాయామయి.

దీపాల వెలుగులు నదిలో ప్రతిఫలిస్తున్నాయి. ఓ అనిర్వచనీయమైన ప్రశాంతత అక్కడ అలుముకున్నది. మహాకన్యాదేవీ, పరివారం బసకి బయలుదేరారు. ఎదురొస్తున్న సాధు సన్యాసులు ప్రజలూ దారినించి గౌరవంతో తొలగి వారికి దారిస్తున్నారు.

"భం భం భోలే" అంటూ ఓ సన్యాసి వారికి అడ్డుపడ్డాడు.

"సాదూ.. ఎవరు మీరు?" అడిగింది మహామాయ.

"అమ్మా, ఉజ్జయిని ఆశీర్వదించింది. మరో ఎనిమిది తీర్థాలు మీరు దర్శించాలి. ఇది శివాజ్ఞ" దారి తొలిగి అన్నాడా సన్యాసి. అతని వంక సూటిగా చూసింది మహా కన్యాదేవి. అతని ఓ చేతిలో శంఖం, మరో చేతిలో త్రిశూలం వుంది. ఓ గుడ్డలాగా కనిపించే 'చపపు' జోలెలో ఏముందో తెలీలేదు. ఒళ్ళంతా భస్మం పూసుకుని వున్నాడు. నుదుటి మీద భస్మరేఖల మధ్య ఎర్రని బొట్టు. అది తళతళలాడుతోంది. అప్రయత్నంగా నమస్కరించింది మహా కన్యాదేవి.

"ఆయుష్మతీభవ.. అమ్మా... నీ పుట్టుక మహోన్నతమైనది. ఒక్కొక్క తీర్ధమూ నిన్ను ఆశీర్వదిస్తూంది. తొమ్మిది తీర్థాలూ దర్శించుకోవాలి" అన్నాడా సాధువు.

"ఎప్పుడు?" అడిగింది మాయామయి.

"అది నిర్ణయించేది మరో కాళేశ్వరుడే తల్లీ. నేను కేవలం సమాచారం అందించే వార్తాహరుడ్ని మాత్రమే!" వినయంగా అన్నాడా సాధువు పూర్తిగా పక్కకి తొలిగి.

మహా కన్యాదేవి నడవడం ప్రారంభించింది.

"సాధు త్రిశూలపాణి మాట్లాడటం ఎప్పుడూ చూడలేదు, వినలేదు, మీరందరూ ఎవరమ్మా?" ఓ వ్యక్తి ఆశ్చర్యంగా అడిగాడు.

" శివభక్తులం. అంతే" అన్నది మాయామయి

"సారీ జయ్.. వచ్చేముందు ఫోన్ చేశాను. కానీ మీకు 'రింగ్' వినిపించలేదనుకున్నాను కానీ, మొత్తం కమ్యూనికేషన్ వ్యవస్థే ఛిన్నాభిన్నమైపోయిందని వూహిమలేదు" గోర్కీ అన్నాడు.

"నో ప్రాబ్లం.. మీరెంత వ్యయప్రయాసలకి ఓర్చి వచ్చారో..! రెండు రోజులు తుఫానులో చిక్కుకుని అన్నం నీళ్ళూ లేకుండా రైల్వే స్టేషన్‌లో చిక్కి, మొత్తానికి రాగలిగారంటే, మీ సహనశక్తికి హేట్సాఫ్ " అన్నాడు జయ్.

జయ్ గోర్కీని ఉద్దేశించి మాట్లాడినా, అందర్నీ దృషిలో పెట్టుకునే ఇంగ్లీషులో మాట్లాడాడు. అంతకు అయిదురోజుల ముందు మెల్లగా మొదలయిన వాన మెల్ల మెల్లగా వామనుడు పాదంతో ఆకాశాన్ని ఆక్రమించినట్లు, తమిళనాడు ఆంధ్ర, కేరళ, కర్ణాటక రాష్ట్రాలను ఆక్రమించింది. కమ్యూనికేషన్స్‌నీ, రోడ్లనీ ఆహార సరఫరా సిస్టమ్స్ నీ

అతలాకుతలం  చేసింది. టెలీఫోన్ స్థంభాలు రోడ్లమీద విరిగిపడ్డాయి. ముందు జాగ్రత్తగా కరెంటు నిలిపి వేయడం వల్ల జనాల ప్రాణాలు దక్కాయి. టెంటులు, గుడిసెలు, షెడ్లు పూర్తిగా నేలమట్టం అయిపోయాయి. చెన్నై పరిసరాల్లో అయితే రోడ్లకి రోడ్లూ కొట్టుకుపోయాయి. వందలాది చెరువులు గట్లు తెంచుకుని సమీప గ్రామాన్ని ముంచివేశాయి. పాలులేవు... ఆహారం లేదు.. కరెంటు లేదు. ఆఖరికి చనిపోయిన శవాన్ని దహనం చేసే ఏర్పాటుకూడా మృగ్యమైనాయి. శవాలు లేచిన ఇళ్లల్లో హాహాకారాలు, పాలకోసం, ఆకలితో ఏడ్చే పిల్లల రోదనలు, ఎప్పుడు ఏ యీదురుగాలికి ఏ యిల్లు కొట్టుకుపోతుందో, ఏ ఇల్లు కూలిపోతుందో అనే భయంతో అల్లల్లాడుతున్న ప్రజలు.. వారి కళ్ళలో కన్నీరు ఇంకి మూడురోజులయింది. 'తడ' దగ్గర చిక్కుకున్న ట్రైను నించి ఎలాగొలా రెండు రోజుల తరవాత మద్రాసుకి చేరు జయ్.

ఇల్లు మంచి హైట్‌లో వుంది. అదృష్టవశాత్తూ ఓ వారం ముందరే జయ్ భార్య సుమతి ఓ నెలకి కావాల్సిన సామాన్లన్నీ తెప్పించి పెట్టడంతో  వాన వరదల్లో వారికి భోజనానికి ఇబ్బంది లేకుండా పోయింది.

"సారీ.. ఇవి పౌడర్ పాలతో కలిపిన టీ.." అందరికీ పొగలు కక్కుతున్న టీ కప్పులు ఇస్తూ అన్నది సుమతి.

"థాంక్స్" అందరూ టీ తీసుకున్నారు ఆత్రంగా.

"ముందుగా టిఫిన్ ఏర్పాట్లు చేయిస్తాను. ఉప్మా అయితే తొందరగా రెడీ అవుతుంది. తిని ఎన్ని పూటలయిందో ఏమో? గోర్కీ పైన నాలుగు గదులున్నాయి. క్రింద రెండు గదులున్నాయి. ఆ ఆరుగదుల్లోనే సర్దుకోక తప్పదు. మా ఇద్దరికీ చెరోగదీ విడిగా వుంది. మేము ఒకే గదిలో అడ్జస్టు అయితే మహాదేవి కూడా మీకు ఉపయోగపడుతుంది. అంటే, ఏడు గదులన్నమాట. కానీ తిరువణ్ణామలై వెళ్ళిన రాబీ విషయం ఏమీ తెలీలేదు" అన్నాడు జయ్. గోర్కీతోనూ, వారితోనూ ఇంగ్లీషులో.

"ఫరవాలేదు. ఒక రూమ్ ని అతనికోసం విడిచిపెట్టి ఆరు రూముల్లోనే సర్దుకుంటాం. నిజం చెబితే జయ్... యీ హాల్ ఒక్కటి చాలు" అన్నాడు గోర్కీ.

"స్టార్ హోటల్స్ తెరిచేవున్నాయి. కానీ వారు వండి వర్చే ఆహారపదార్థాలు ఫ్రెష్‌వి కావు. ముఖ్యంగా ఆకుకూరలు . ఎందుకంటే, అవి వచ్చేది పక్కనుండే గ్రామాలనించి. ఆ రోడ్లు ఇంకా చక్కబడలేదు. మిస్టర్ సర్స్, క్షమించాలి. మీకు వెజిటేరియన్ ఫుడ్ మాత్రమే సర్వ్ చెయ్యగలను" అపాలజిట్‌గా అన్నాడు జయ్.

"బట్.. గోర్కీ చెప్పినప్పుడే విస్కీ, బ్రాందీ, రమ్, ఓడ్కా తలో రెండు ఫుల్ బాటిల్స్ తెప్పించి పెట్టాను" నవ్వి అన్నాడు జయ్.

"ఓహ్... సో నైస్" ఆనందంగా అన్నాడు వారితో వచ్చిన శమంతో భట్టాచార్య. అతను మందు ప్రేమికుడు.  జయ్ స్వయంగా వారిని పైకి తీసికెళ్ళి గదుల తలుపులు తెరిచి ఆహ్వానించాడు.

"ఓహ్.. ఫైవ్ స్టార్ హోటల్ రూమ్స్ లా వున్నాయి" అన్నాడు శమంతో భట్టాచార్య.

"మనిషి కష్టపడి సంపాదించాలి. సంపాదించిన దాంట్లో కొంత సుఖంగా బ్రతకడానికీ, కొంత సమాజానికీ, కొంత మాత్రం ఏకుటుంబానికీ అనేది జయ్‌దేవ్ పాటిస్తున్న ఆర్థిక సూత్రం. 'పిల్లలకి చక్కటి విద్య నివ్వు. బేంకు బేలన్సులో కోట్లు కాదు ' అని ఎప్పుడూ చెప్పేవాడు" శమంతో భట్టాచార్యతో అన్నాడు గోర్కీ.

"గ్రేట్ ప్రిన్సిపుల్" మనస్పూర్తిగా మెచ్చుకున్నాడు రజోస్కీ.

"యస్.. మేం మాకోసమే సంపాయిస్తాం, ఖర్చు చేస్తాం. సమాజం గురించో పిల్లల గురించో పెద్దగా ఆలోచించము. మీరు, అంటే, ఇండియంస్ అన్నింటినీ చక్కగా బేలన్స్ చేస్తారు" సిన్సియర్‌గా అన్నాడు స్టిట్సన్.

"స్పేషియస్ రూమ్స్" గోర్కీ చూపించిన గదిలోకి అడుగుపెడుతూ అన్నాడు డాంట్.

సచేత్ దద్లానీ జయ్‌ని కౌగిలించుకుని, "జయ్.. నిజంగా ధన్యవాదాలు" అన్నాడు.

"నో..నో..నో ఇట్స్ మై డ్యూటీ" అన్నాడు జయ్.

సచేత్‌తోపాటు అభిజీత్ ఆచార్య, మొహమ్మద్ అతీం (ఢిల్లీ) రిషియాదవ్ (హర్యానా) నరోత్తంఝా (యుపి) సబర్‌జీత్ సింగ్ (పంజాబ్) వచ్చారు.

హోల్‌వీట్ బ్రెడ్ స్లైసెస్‌తోబాటు జామ్, బటర్, సలాడ్, ఆలూ స్టఫ్ పరోటా, వెజిటబుల్ బిరియానీ, టమోటా సూప్, అప్పడాలు, వడియాలు, పూరీలు, బంగాళా దుంపకూర, రసం, గుత్తొంకాయ కూర చేసింది. వంటలో జయ్ చాలా సహాయం చేశాడు. లస్సీ కూడా ప్రిఫేర్ చేశారు ఫారినర్స్‌కి నచ్చుతాయో లేదో అని చిన్న బాధ జయ్‌లో వుంది.

డోంట్ వర్రీ జయ్. సతారాలో వారికీ కొంత ఇండియన్ ఫుడ్ అలవాటుంది, రిలాక్స్" అన్నాడు గోర్కీ.

"ఏం లేదు సర్స్, ఆహారమూ వ్యవహారమూ అంటారు మా పెద్దలు. పొద్దున ఉప్మా తిన్నాక మీరు నిద్రపోవడం బాగయింది. శరీరానికి కొంత విశ్రాంతి లభిస్తుంది. ఇక ఇప్పటి సంగతంటారా. మధ్యాహ్నం మూడు గంటలయింది. ఏ చర్చ జరిపినా, ఏ నిర్ణయాలు తీసుకున్నా ఆకలితో వున్నప్పుడు చేయకూడదని మా పెద్దలు మాట. ఆకలితో వున్నప్పుడు మెదడు సునిశితంగా ఏదీ గ్రహించలేదుట. అందుకే తీరిగ్గా, విశ్రాంతిగా భోజనాలు కానిచ్చాక మన చర్చ మొదలు పెడదాం" అన్నాడు జయ్.

"ఎగ్జాట్లీ అదేమాట మా నాన్నగారూ చెప్పేవారు" జయ్ వంక చూస్తూ అన్నాడు సచేత్ దద్లానీ.

"అది మంచి పద్ధతి. యస్.. కడుపులో ఆకలి వున్నప్పుడు మనసు ఏదీ గ్రహించలేదు" అన్నాడు స్టిట్సన్.

అందరూ సంతృప్తిగా భోం చేశారు. సిగరెట్ ముట్టిస్తూ "జయ్.. శాస్త్రిగారు ఎక్కడ వున్నారు?" అడిగాడు దద్లానీ.

"శాస్త్రిగారూ, రామజోగీ, శృంగీ, మట్టూ తిరుపతిలో వున్నారు. సుదర్శన్ బెంగుళూర్‌కీ, మదాలస యజ్ఞప్పగారూ హార్స్‌లీ హిల్స్‌కి వెళ్ళిపోయారు. రాబీ తిరువణ్ణమలైకి వెళ్ళాడు. కమ్యూనికేషన్స్ దెబ్బతిన్నాయి గనక అతని ప్రస్తుత పరిస్థితి తెలీదు. శ్రీనివాస్ తిరుపతిలోనే ఉన్నాడు" అన్నాడు జయ్.

"మీరందరూ అసలు ఎందుకు సమావేశమయ్యారు? మళ్ళీ ఎందుకు డిస్పర్స్ అయ్యారూ? మొత్తం ఓసారి వివరంగా చెప్పగలరా. దయచేసి ప్రతి చిన్న విషయాన్నీ గుర్తుచేసుకుని చెప్పండి" రిక్వెస్టింగ్‌గా అన్నా, స్థిరంగా అన్నాడు ఎడ్వర్ట్ డాంటే.

అందరివంకా ఓసారి చూశాడు జయ్. జయ్ భార్య సుమతి కూడా భోజనం ముగించి వచ్చి కూర్చుంది. జయ్ సుమతికి ఏ విషయమూ లోతుగా చెప్పలేదు. సుమతి మనసునిండా కుతూహలమే. ఆ విషయం గమనించి,

"కూర్చోమ్మా.. కొన్ని కొన్ని విషయాల్లో స్త్రీలకుండే సూక్ష్మగ్రాహత మగవాళ్ళకి ఉండదు" అన్నాడు గోర్కీ. చిన్నగా నవ్వింది సుమతి.

"ఇది ఎలా మొదలయిందంటే" అంటూ మొదలెట్టి, రాబీ ఇండియా రావడం, తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో 'తండ్రీ' అంటూ తెలుగులో అరిచి పడిపోవడం, అంతకు ముందు తన తండ్రి అక్కడే వుండేవాడనీ అప్పట్లో ఆ వీధి ఇలా వుండేది కాదనీ శ్రీనివాస్‌తో చెప్పడం, రాబీ స్పృహ తప్పడం మొదలైనవన్నీ పూసగుచ్చినట్టు చెప్పాడు జయ్.

"అంతేకాదు..." అని మరోసారి గొంతు సవరించుకుని, మహా శాంతి యాగం గురించీ, పలమనేరు దగ్గర గాలీ, వర్షంలో శ్రీనివాస్ వచ్చి ఫుడ్ ఇవ్వడం గురించీ, కలలో రాబీకి మహాభారత కాలంనాటి ఆయుధాలు కనబడడం గురించీ, శరద్వతీ శ్రీనివాస్‌ల కల్యాణానికి కారణం విలిమ్సే, గుడిమల్లంలో వివాహానికి రామజోగి రావడం గురించీ, నివృత్తి యుగం చివరలో ఓ రంగులీనే గుండ్రని మహాశిల లభించడంగురించీ, సంకల్పానంద అక్కడే వుండిపోవడానికి నిర్ణయించుకోవడం గురించీ సంపూర్ణంగా చెప్పాడు జయ్. అందరూ చెవులు రిక్కించి వింటున్నారు. మొత్తం మూడు గంటల యాభై నిముషాలపాటు జరిగింది.

"గాడ్!" అన్నాడు రాజోవ్స్కీ.

"దీని వెనక చాలా రహస్యాలు ఉండివుండొచ్చు.

కాలం కడుపులో దాచుకున్న రహస్యాలకి అంతే వుండదు. అలాగే మనమేకాక మరెందరో ఇలా ప్రపంచ శాంతి కోసం పనిచేద్దూ వుండొచ్చు .ఏదేమైనా, గోర్కీ మీరు ఇండియాకి వచ్చిన వైనాన్ని కూడా పూర్తిగా మీలో ఒకరు వినిపించండి. ఆ తరవాత 'ద సిటీ అబ్జర్వర్ ' ఎందుకు మిమ్మల్నందర్నీ కలిసిందో నేను వివరంగా చెబుతాను" అన్నాడు అభీజీత్ ఆచార్య.

"యస్.. అదే సరైన పద్ధతి" అన్నాడు స్టిట్సన్.

"సార్... సాయంత్రం దటి రాత్రి అడుగుపెడుతోంది. ఇవాళ్టికి చర్చ చాలిద్దాం. ఎవరికి వారుగా మనం విన్నదంతా ఓ పద్ధతిలో వ్రాసుకుందాం. మన సందేహాలనీ, ప్రశ్నలనీ కూడా వ్రాసుకుందాం. ఎందుకంటే, మరో చర్చ ఇప్పుడే మొదలెడితే, జరిగిన చర్చ తాలూకూ 'గాఢత' తరిగిపోయింది" అన్నాడు శమంతో భట్టాచర్య.

"నూటికి నూరుపాళ్ళూ కరెక్ట్. బెంగాలీల ఆలోచనా విధానమే వేరు" మెచ్చుకున్నాడు సబర్‌జీత్ సింగ్.

"యస్.. యూ ఆర్ రైట్" అన్నాడు మొహమ్మద్ ఆతీమ్.

గోర్కీ లేచాడు. జయ్ కూడా లేచాడు. సభ ముగిసింది గనక అందరూ లేచారు.

"తొమ్మిదివరకూ నోట్స్ వ్రాసుకోవచ్చు" అన్నాడు జయ్. ఓ పదిహేను నోట్ బుక్సూ, బాల్ పెన్నూ పెట్టిన బాక్సుని సచేత్ చేతికిస్తూ.

"మేమూ హెల్ప్ చేస్తాం" అన్నారు మిగతావారు. బాటిల్స్‌తో సహా అందరూ టెర్రస్ మీదకి చేరారు. ఆకాశం నిర్మలంగా వుంది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments